క్లుప్తంగా

అన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎంపీటీసీ జోగినాయుడు, నాయకులు

గుర్ల: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఇటీవల గుండె శస్త్రచికిత్స జరిగింది. ఆయన త్వరగా కొలు కోవాలని ఆకాంక్షిస్తూ పకీరు కిట్టాలి ఎంపీటీసీ బూర్లె జోగినాయుడు, ఆగ్రామ వైఎస్సార్‌సీపీ నేతలు అచ్యుతాపురంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెయ్యిమందికి అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణ, శేరీపేట నాయకులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం



రాచగుమడాంలో పూజలు చేసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ అప్పలరాజు

మెరకముడిదాం: మండలంలోని రాచగుమడాం- ఎం.గదబవలస గ్రామాల మధ్య తారు రోడ్డు నిర్మాణ పనుల ను రాచగుమడాం సర్పంచ్ అప్పలరాజు శనివారం పూజలు చేసి ప్రారంభించారు. రూ.2 కోట్ల నిధులతో 2.8 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును నిర్మించనున్నారు. గతంలో వర్షా కాలంలో ఈ గ్రావెల్ రోడ్డులో ప్రయాణాలు సాగించేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మిస్తుండడంతో ఇకపై తమ ఇబ్బందు లు తీరినట్లేనని రాచగుమడాం, భీమవరం గ్రామస్తులతో పాటు తెర్లాం మండలం ఎం.గదబవలస గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాగజ్యోతి కన్‌స్ట్రక్షన్ ప్రతినిధి ప్రతినిధి కె.వి.రమణరాజు,తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు,కాలువ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ప్రసాద్, తదితరులు

మెరకముడిదాం: మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద సీసీ రోడ్డు, కాలువ నిర్మాణానికి రాష్ట్ర క్షత్రియ పరిషత్ సభ్యుడు కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ శనివారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.9 లక్షల ఉపాధిహామీ నిధులతో ఈపనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కె.గురాజు, నాయకులు లెంక భాస్కరరావు, కొమ్ము శంకరరావు, కె.జగదీష్, ఎం.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ సందర్శన



మార్ట్‌లో సరుకులను పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ చక్రవర్తి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని మహిళా మార్ట్‌ని డీఆర్డీఏ పీడీ ఏ.కె.చక్రవర్తి శనివారం సందర్శించారు. మార్ట్ నిర్వహణపై సిబ్బంది ని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్ట్‌ని సమన్వయంతో లాభార్జన దిశగా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. చేయూ త డీపీఎం రవి, మార్ట్ ఏపీఎం ధనలక్ష్మి, ఏపీఎం ఎల్.పద్మ ఉన్నారు.

దివ్యాంగులకు మోటారు ట్రైసైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు మోటారు ట్రైసైకిళ్లను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలానికి చెందిన అయిదుగురు దివ్యాంగులకు వికలాంగుల సంక్షేమ శాఖ సమకూర్చిన బ్యాటరీ మోటారు ట్రైసైకిళ్లను జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీని వాసరావు మండల కేంద్రంలో శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగించుకోవాలని సూచించారు.

లింగ వివక్షను వ్యతిరేకిద్దాం..



చీపురుపల్లి: చీపురుపల్లిలో ర్యాలీ చేస్తున్న అధికారులు, స్వయం సహాయక సంఘాలు



కొత్తవలస : విజయగనరం-కొత్తవలస రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, మహిళలు

లింగవివక్షను వ్యతిరేకించి సమ సమాజం స్థాపిద్దామని అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక, స్త్రీల హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా వెలుగు ఆధ్వర్యంలో గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మానవ హారాలుగా ఏర్పడి, లింగవివిక్షను రూపుమాపేందుకు అంతా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. పలువురు మాట్లాడుతూ లింగ వివక్ష అనే ఆలోచన సమాజానికి మంచిది కాదని, ఆడ,మగ సమానేమనని అన్నారు. సమాజంలో భయం లేకుండా స్వేచ్ఛగా జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, లింగ ఆధారిత సమస్య మహిళలకు సంబంధించినదే కాదని, అందరి సమస్యగా భావించాలన్నారు.

– కొత్తవలస/లక్కవరపుకోట/ జామి:గుర్ల/బొండపల్లి/చీపురుపల్లి/ చీపురుపల్లిరూరల్(గరివిడి)/ గంట్యాడ



బొండపల్లి: బొండపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఎంపీపీ చలంనాయుడు



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో ర్యాలీ చేస్తున్న అధికారులు, మహిళలు



గంట్యాడ: గంట్యాడలో ర్యాలీ చేస్తున్న మహిళలు , అధికారులు



జామి: జామిలో ప్రతిజ్ఞచేస్తున్న అధికారులు, డ్వాక్రా సంఘాల సభ్యులు



గుర్ల: కెల్లలో ర్యాలీ చేస్తున్న మహిళలు, అధికారులు, నాయకుడు కె.వి.సూర్యానారాయణరాజు



లక్కవరపుకోట: ఎల్.కోటలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు



వేపాడ: కరకవలసలోర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

శృంగవరపుకోట: మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నికను స్థానిక సుబ్బ రామిరెడ్డి కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. మండల శాఖ గౌరవాధ్యక్షులుగా వి.ఈ.సత్యనారాయణ, వి.ఎస్.దేముడు, మండల అధ్యక్షుడిగా ఎం.వి.ఎస్.నారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఏ.శ్రీనివాస్, కోశాధికారిగా ఏ.రాముతో పాటు కార్యవర్గ సభ్యులను ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్గవర్గంతో ఎన్నికల అధికారి, పరిశీలకులుగా వ్యవహరించిన జిల్లా కార్యదర్శులు జి.వి.రమణ, జి.రాజారావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆశాఖ నాయకులు కొండ లరావు, తదితరులు పాల్గొన్నారు.

90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు

వేపాడ: నీటి సదుపాయం ఉన్న అయిదు ఎకరాల్లోపు రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్, స్ప్రింకర్ల పరికాలను ప్రభుత్వం అందిస్తోందని ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ఎన్.వి.లక్ష్మీనారాయణ తెలిపారు. మండల కేంద్రంలో రైతు ఆర్.ఎల్.నరసకు మంజూరు చేసిన బిందు సేద్యం(డ్రిప్ ఇరిగేషన్) పరికరాల యూనిట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ విధానంలో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేయవచ్చని తెలిపారు.

అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- అధికారులతో జెడ్పీ చైర్మన్ సమీక్ష
- విధుల్లో అలసత్వం వహించిన పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం



విధుల్లో అలసత్వం వహించిన పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండల, గ్రామస్థాయి అధికారులు అంతా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, ప్రజాసమస్యల పరిష్కారంలో జాప్యం చేయవద్దని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. భీమవరం గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు తమ గ్రామానికి చెందిన బందాపు బంగారమ్మ ఇటీవల మృతి చెందిందని, ఆమె మరణధ్రువీకరణ పత్రం జారీచేయకుండా పంచాయతీ కార్యదర్శులు ఫిరోజ్ కుమార్, మురళీకార్తీక్ తిప్పుతు న్నారని జెడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి చైర్మన్ స్పందిస్తూ నిబంధనల ప్రకారం మరణ వీకరణ పత్రాన్ని ఇవ్వకుండా మీ సొంత నిబంధనలు పెట్టడమేంటని, మీకున్న ఇబ్బందేంటని పంచాయతీకార్యదర్శులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తక్షణమే మరణధ్రువీకరణ పత్రం అందజేయాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దెబ్బతిన్న వరి పంట నష్టం వివరాలను వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల వారీగా అంచనా వేస్తున్నారని, రైతుల వారీగా నష్టం వివరాలు నమోదు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, సోమలింగాపురం ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు చైర్మన్‌కు వివరించారు. గ్రామాల వారీగా కాకుండా క్షేత్రస్థాయిలో ప్రతీ రైతు సాగు చేసిన వరి పంటను వీఏఏలు పరిశీలించి పంటనష్టాన్ని నమోదు చేయించేలా చూడాలని ఏఓ శ్రావణితేజకు చైర్మన్ సూచించారు. శ్యామాయవలసకి చెందిన ఓ ప్రజాప్రతినిధి మాట్లాడుతూ తాను తన సొంత ఖర్చులతో గ్రామానికి చెందిన శ్మశానవాటికలో తుప్పలను తొలగించి చదును చేయిస్తుంటే వీఆర్‌ఓ అత్యుత్సాహం ప్రదర్శించి పనులను అడ్డుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ.. మీరేమైన ఆ పనులను ఆపమని వీఆర్‌ఓను ఆదేశించారా అని తహసీ ర్ విజయభాస్కర్‌ను వివరణ కోరగా.. తాను ఆపనులను ఆపమని ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని తహసీల్దార్ బదులివ్వడంతో సంబంధిత వీఆర్‌ఓపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పులిగుమ్మి గ్రామంలో రీసర్వేలో భాగంగా సర్వే నంబర్-1లో 325 ఎకరాల భూమిని అధికారులు సర్వే చేయలేదని సర్పంచ్ ఈశ్వరరావు చెప్పగా.. వెంటనే జిల్లా సర్వే ఏడీతో చైర్మన్ ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వైస్ ఎంపీపీ టి.హరిబాబు, నాయకులు కోట్ల విశ్వేశ్వరరావు, కె.వి.సూర్యనారాయణరాజు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, పప్పల కృష్ణమూర్తి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్

గంట్యాడ: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర లక్ష్యమని జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రను మండలంలోని రామవరం, సిరిపురం గ్రామాల్లో శనివారం చేపట్టారు. పీఎం ఆవాస్‌యోజన, గరీబ్‌కల్యాణ్‌అన్నయోజన, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల్ యోజన, విశ్వకర్మ, కిసాన్ సమ్మాన్, స్వమిత్వ జన్‌ధన్‌యోజన, జీవన్ జ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన, ప్రణామ్ తదితర పథకాల గురించి ఎల్‌సీడీ స్క్రీన్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ జిల్లాకు ఆరు వికసిత్ భారత్ సంకల్పయాత్ర రథాలు వచ్చాయని, ఒక్కోరథం రోజుకు రెండు గ్రామాల్లో పర్యటిస్తుందన్నారు. మొ త్తం ఆరు రూట్లలో ఈయాత్ర సాగుతుందని చెప్పా రు. కార్యక్రమానికి గ్రామ వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాష్ట్ర స్థాయి నోడల్ అధికారిగా, జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని చెప్పారు.గ్రామస్థాయిలో సర్పంచ్ చైర్మన్, గ్రామస్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, ఎంపీడీఓ భవాని, డీపీహెచ్‌ఎన్‌ఓసత్యవతి, సర్పంచ్ పద్మావతిపాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి



మరడాంలో ఇంటింట ప్రచారం చేస్తున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు



ఏ.ఆర్.పేటలో వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ సరయు

దత్తిరాజేరు/ జామి: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని దత్తిరాజేరు ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు,వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, జామి జెడ్పీటీసీ గొర్లె సరయు, ఆ మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గొర్లె రవికుమార్ కోరారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మరడాం, ఏ.ఆర్.పేటలో శనివారం నిర్వహించారు. జామి వైస్ ఎంపీపీ ఎన్నింటి విజయలక్ష్మి, ఏ.ఆర్.పేట సర్పంచ్ చెల్లూరి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



గజపతినగరం: బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినుల కోలాటం

గజపతినగరం: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర, బాలికోన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు.రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి అధ్యాపకులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు పట్నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని అన్నారు. బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల కోలాటం, కర్రసాము, నృత్యప్రదర్శన ఆకట్టుకున్నాయి.హెచ్‌ఎంలు చిప్పాడ రమేష్‌కుమార్, మీసాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగం ఔన్నత్యాన్ని, భారత రాజ్యాంగ రచనలో మేధావుల కృషిని విద్యార్థులకు వివరించారు. కళాశాల విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల సిబ్బంది కే.వాసుదేవరావు, వి.సుధీర్, ఏ.ప్రసాద్, ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షులు డి.సూర్యారావు, వి.సాంబమూర్తి పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప సన్నిదానపూజ



అయ్యప్ప స్వామికి అభిషేకాలు చేస్తున్న స్వాములు

కొత్తవలస: మండల కేంద్రంలో శబరిగిరివాస పీఠం ఆధ్వర్యంలో శనివారం రాత్రి అయ్యప్ప సన్నిదాన పూజను గురుస్వామి యల్లపు వెంకటరమణ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. కొత్తవలస, లక్కవరపుకోట, జామి, వేపాడ,పెందుర్తి తదితర మండలాల నుంచి హాజరైన సుమారు 3వేల మంది అయ్యప్పమాలదారుల శరణుఘోషతో ఆ ప్రాంతం మారుమ్రోగిపోయింది.

సంక్షిప్తంగా..

బడ్జెట్ ఆమోదం



బడ్జెట్ సమావేశానికి హాజరైన మండల పరిషత్ సభ్యులు

లక్కవరపుకోట: మండల పరిషత్ 2023-24 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2024-25 అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ దొర బడ్జెట్ వివరాలను సభకు చదివి వినిపించారు. వైస్ ఎంపీపీ లు శ్రీనురాజు, ఆవాల శ్యామల, ఎంపీడీఓ కె.రూపేష్ పాల్గొన్నారు.

మద్యం సీసాల ధ్వంసం

గజపతినగరం: గజపతినగరం సర్కిల్‌లోని అయిదు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గతంలో పలువురు అక్రమంగా రవాణా చేస్తుండగా పోలీసులు సీజ్ చేసిన 709 మద్యం సీసాలను ఎస్‌ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శైలజారాణి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద శనివారం ధ్వంసం చేశా రు. గజపతినగరం,బూర్జివలస,ఆండ్ర ఎస్ఐలు సీహెచ్ గంగరాజు, లక్ష్మీప్రసన్నకు మార్, సిద్ధార్థ పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల పరిశీలన

చీపురుపల్లి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల విద్యాసామర్థ్యాలపై డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో 21 మంది ఉపాధ్యాయు ల బృందం శనివారం పరిశీలన చేసింది.ఈ బృందం ప్రతీ తరగతి గదికి వెళ్లి అక్కడ ఉపాధ్యాయులు సబ్జెక్టులు వారీగా బోధిస్తున్న తీరును పరిశీలించి, విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. డైట్ ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు మాట్లాడుతూ నివేదికను జిల్లా విద్యాశాఖాధికారి సమర్పించనన్నట్లు స్పష్టం చేశారు. బోధనలో ఇక్కడుండే లోపాలతో పాటు చక్కని అంశాలను పరిశీలించాలమని చెప్పారు. డైట్ అధ్యాపకుడు ఎల్.రామకృష్ణ, హెచ్‌ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చేలా మండల బడ్జెను రూపొందించామని ఎంపీపీ పీరుబండి హైమావతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2024-25 సంవత్సరం అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమెదించారు .జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ కిలపర్తి వెంకటలక్ష్మి, ఎంపీడీఓ వై.భవాని పాల్గొన్నారు.

కుట్టు మెషిన్ల పంపిణీ

గజపతినగరం: విజయవాడకు చెందిన వాసవ్య మహిళా మండలి, బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌బిఐడీబీఐ బ్యాంకు సహకారంతో స్థానిక లయన్స్ క్లబ్‌లో 25 మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ శనివారం కుట్టు మెషిన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పురిటిపెంట-1, 2 ఎంపీటీసీలు మండల సూర్యకళ, రేగ లత పురిటిపెంట సర్పంచ్ శొంఠ్యాన విజయలక్ష్మి,వాసవ్యమహిళా మండలి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల వివరాలు పరిశీలించండి

బొండపల్లి/వేపాడ: బీఎల్‌ఓలు ప్రతీ ఇంటికి ఓటర్ల జాబితాతో వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని గజపతినగరం నియోజకవర్గ ఈఆర్‌ఓ డి.వెంకటేశ్వరరావు, వేపాడ తహసీల్దార్ ప్రసన్నకుమార్ సూచించారు. బొండపల్లి, వేపాడ తహసీల్దార్ కార్యాలయాల్లో బీఎల్‌ఓలతో శనివారం వారు సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చనిపోయిన వారి వివరాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని, 18 ఏళ్లు నిండిన వారి నుంచి ఓటు హక్కు నమోదుకు దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు. బూత్‌స్థాయి ఏజెంట్‌కు సమాచారం అందించి ఈనెల 26 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు ప్రతి ఇంటికీ బీఎల్‌ఓలు వెళ్లి ఓటరు జాబితాల్లో పేర్లు సరిచూడాలని చెప్పారు. బొండపల్లి తహసీల్దార్ డి.జి.ఎన్.ప్రసాదరావు, డీటీ ఆర్.శంకరరావు, సీనియర్ సహాయకులు సత్యనారాయణ, ఆర్‌ఐ.కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం

జామి: భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీకదీపోత్సవాన్ని అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి దీపారాధన చేశారు. జెడ్పీటీసీ గొర్లె సరయు,ఆలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.



దీపారాధన చేస్తున్న భక్తులు

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధంకండి

ప్రభుత్వం మంజూరుచేసిన గృహాలను త్వరగా పూర్తిచేసి సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలని హౌసింగ్, మండలాల ప్రత్యేక అధికారులు లబ్ధిదారులకు సూచించా రు. హౌసింగ్‌డేలో భాగంగా వేపాడ మండలంలోని కరకవలస, గంట్యాడ మండలంలోని నందాం, కొత్తవలస మండలంలోని కంటకాపల్లి, బొండపల్లి మండలంలోని దేవు పల్లి గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లు, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశమై వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. నిర్మాణాల దశను ఆధారంగా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని చెప్పారు.

– వేపాడ/గంట్యాడ/కొత్తవలస/బొండపల్లి



కొత్తవలస: కంటకాపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ ధర్మారావు,తదితరులు



బొండపల్లి: దేవుపల్లి జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్



వేపాడ: కరకవలసలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ



గంట్యాడ: నందాంలో లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ రంగారావు

దరఖాస్తుల పరిశీలన

జామి: ఓటర్ల క్లెయిమ్స్‌ను ఈఆర్‌ఓ (ఎన్నికల రిటర్నింగ్ అధికారి) వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు.స్థానిక తహసీల్దార్ కార్యలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఓటర్ల చేర్పులు, మార్పులు తదితర అంశాలపై అందిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.